

యువత దేశానికి విలువైన సంపద

- జాతీయ యువజన దినోత్సంలో కమిషనర్ రవీంద్రబాబు



నివాళ్లులర్పిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు తదితరులు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

స్వామి వివేకానందుని మాటలు తారకమంత్రాలుగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఆదివారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాజ్ విహార్ కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఏటా జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని నిర్వహించుకుకుంటామని, అదేరోజు వివేకానందునికి యువతతో లోతైన అనుబంధం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు వివేకానంద ఎన్నో విజయ రహస్యాలను అందరితోనూ పంచుకున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుంటారన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్నదేశం మనదే అని, దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమని, వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి యువత పాటుపడాలని సూచించారు. యువత స్వామి వివేకానందమార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. ప్రపంచంలో ప్రతిదేశం, ప్రతివ్యక్తి స్వామి వివేకానందుడిని ఎంతగానో గౌరవిస్తారని, దానికి కారణం వివేకానంద భారతదేశం తరపున అమెరికా వెళ్లి తన మాట తీరుతో అక్కడి ప్రజలందరి చేత శభాష్ అనిపించుకున్నారన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను అనుసరించిన వారి వ్యక్తిత్వం కచ్చితంగా మారుతుందన్నారు.

కర్నూలు కార్పొరేషన్: దేశ ప్రతిష్టను ప్రపంచం నలుమూలల చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందుడని జిల్లా కేంద్ర గ్రంథాలయ సహాయ గ్రంథాలయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రగ్రంధాలయంలో స్వామివివేకానంద 162వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. వజ్రాల గోవిందరెడ్డి తన తోటి ఉద్యోగులతో ,విద్యార్తులతో పాఠకులతో కలిసి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. లైబ్రేరియన్ పద్మావతమ్మ, రికార్డు అసిస్టెంట్ ఈశ్వరమ్మ, హెల్పర్ ఉమ , విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మతసామరస్యం కోసం పనిచేద్దాం : డివైఎఫ్ఐ

కర్నూలు క్రైమ్ : వివేకానంద స్ఫూర్తితో మతసామరస్యం కోసం అందరం కలిసి పనిచేద్దామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిన జాతీయ యువజన దినోత్సవాన్ని డివైఎఫ్ఐ ఉల్చాల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామ కార్యదర్శి హరికిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. సర్వ మతాల సారం ఒక్కటే అని ప్రచారం చేశారని అన్నారు. జీవుడేదేవుడు, మానవసేవయే మాధవసేవ అని దేశం మొత్తం తిరిగి ప్రచారం చేశారన్నారు. భారతదేశం ప్రేమకు కరుణకు శాంతికి ప్రతిరూపమని వివేకానంద తెలియజేశారని అన్నారు. భారతదేశంపై అనేక దేశాలు దండెత్తినప్పటికీ భారతదేశం ఇతర దేశాలపై ఎప్పుడూ దండెత్త లేదని అన్నారు. మనిషికి మోక్షం ఎప్పుడు వస్తుందంటే మనిషి ఆకలితో బతికినంతకాలం ఎలాంటి మోక్షం ఉంటుందని స్వామి వివేకానంద చెప్పారన్నారు. అందుకే ప్రశ్నించాలని అన్నారన్నారు. అలాంటి మాటలు చెప్పిన స్వామి వివేకానందను మతం పేరుతో రాజకీయం చేసే నాయకులు మత ప్రబోధకుడుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాలు, మసీదులు చర్చిలపై దళితులు మైనార్టీలు క్రైస్తవులపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, పెద్దలు వివేకానంద స్ఫూర్తితో మతసామరస్యం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మిఠాయిలు పంచుకొని వేడుక చేసుకున్నారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అంజి, రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్, డివైఎఫ్ఐ గ్రామ నాయకులు సుధాకర్, గోవర్ధన్, విశ్వం, హరి, మోహన్, శ్రీను, శివ, రఘువరన్, మధుసూదన్, ప్రవీణ్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


నివాళ్లులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

హెచ్‌ఎంపివి ప్రాణాంతకం కాదు

- భయాందోళనలు అవసరం లేదు
- వైద్యుల సలహాలు, ముందు జాగ్రత్తలు చాలు
- ప్రజాశక్తితో డిఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రపంచ దేశాలలో ఆందోళన కలిగించిన వైరస్ కోవిడ్. ఈ మహమ్మారి వైరస్ చైనా దేశం నుంచి ఇతర దేశాలకు విస్తరించింది. అనంతరం మరోసారి హెచ్‌ఎంపివి (హుమాన్ మెటా న్యూరో వైరస్) చైనా దేశాన్ని ఆందోళనకు గురి చేస్తుందన్న వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో మన దేశంలో కూడా హెచ్ ఎం పి వి వైరస్ కు సంబంధించిన వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో హెచ్‌ఎంపివి వైరస్ వ్యాప్తి ఉందా? లేదా? ఎలాంటి చర్యలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు..

జిల్లాలో హెచ్ ఎం పి వి వైరస్ కేసులు నమోదు అయ్యాయా? ఈ కొత్త వైరస్ గురించి వివరాలు చెప్పండి?

డిఎంహెచ్ఓ : జిల్లాలో కొత్త వైరస్ హెచ్‌ఎంపివి కేసులు ఎక్కడ నమోదు కాలేదు. ఈ వైరస్ చైనా దేశం నుంచి వ్యాప్తి చెందేందుకు అవకాశాలు ఉన్నాయి. నీవు రిలే కుటుంబానికి చెందిన ఈ వైరస్ గతంలో వచ్చిన కోవిడ్ వైరస్ లాగే ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తుంది. జలుబు, వైరల్ జ్వరాలు, ఒళ్ళు నొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలు చలి తీవ్రత తదితర లక్షణాలతో ఈ వైరస్ ఉంటుంది.

హెచ్‌ఎంపివి ప్రమాదకరమా? ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి?

డిఎంహెచ్ఓ : ఈ వైరస్ ప్రాణాంతకం కాదు. ప్రజలు భయాందోళన చెందవద్దు. హెచ్‌ఎంపివి వైరస్ పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా వారితో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. ఈ వైరస్ పట్ల చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి. జన సమూహాలకు వెళ్లినప్పుడు దూరం పాటించాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటికి, ముక్కుకు చేతి రుమాలు అడ్డుపెట్టు కోవాలి. శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరం లేదా తుమ్ములు ఉంటే జన సమూహాలకు వెళ్లకూడదు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. తగిన జాగ్రత్తలు పాటించాలి.

హెచ్‌ఎంపివి వైరస్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుంది?

డిఎంహెచ్ఓ : జిల్లాలో ఎక్కడా హెచ్‌ఎంపివి కేసులు నమోదు కాలేదు. అయినా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్మన్ నుండి ప్రత్యేక కిట్లు తెప్పిస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ వైరస్‌పై అవగాహన కల్పిస్తున్నాము. కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌ఎంపివి వైరస్ ఐసోలేషన్ వార్డును ఇరవై పడకలతో ఏర్పాటు చేశారు.

అర్బన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల పనితీరు ఎలా ఉంది?

డిఎంహెచ్ఓ : ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అర్బన్ హెల్త్ సెంటర్‌లు, పిహెచ్‌సిలు, సబ్ సెంటర్‌ల ద్వారా అందిస్తున్నాము. జిల్లా పర్యటనల సందర్భంగా పిహెచ్‌సిలలో పనితీరుకు మెరుగైన సలహాలు సూచనలు వైద్య సిబ్బందికి ఇస్తున్నాము.

పిహెచ్‌సిలలో అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయా?

డిఎంహెచ్ఓ : ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రోగాలకు సంబంధించిన మందులు, యాంటీబయాటిక్‌లు పిహెచ్సిలలో అందుబాటులోనే వున్నాయి.

క్యాన్సర్ స్క్రీనింగ్, డయాబెటిక్, బిపి సర్వే ఎలా సాగుతోంది?

డిఎంహెచ్ఓ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్క్రీనింగ్ టెస్ట్ 18 ఏళ్ల పైబడిన వారందరికి సర్వే బృందం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తుంది. ఒక బృందం రోజుకు 8 నివాసాలను సర్వే చేసి వాటిని కంప్యూటరైజ్ చేస్తున్నాం. ప్రధానంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారా కాన్సర్ వంటి లక్షణాలు తేలితే మెడికల్ ఆఫీసర్ పరీక్షించి కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌కు పంపించి గుర్తిస్తున్నాం. ఆ విధంగా గుర్తించిన వారందరికీ ప్రాథమిక స్టేజిలోనే వైద్యం అందించే లక్ష్యంతో వీటిని చేపడుతున్నాము. ఈ టెస్ట్‌ల ద్వారా క్యాన్సర్ త్వరగా గుర్తించి క్యాన్సర్ మరణాలు సంభవించకుండా నివారించే అవకాశం ఉంటుంది.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ భవిష్యత్తు కార్యక్రమాలు ఏమి చేపట్టనుంది?

డిఎంహెచ్ఓ : జిల్లాలో లెప్రసీ కేసులను గుర్తించే సర్వే కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. ఈ సర్వే ద్వారా జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందా లేదా అనే అంశాన్ని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వానికి నివేదికలు అందించనున్నాం.



మైనేని గొప్ప ఆదర్శనీయుడు

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మైనేని వెంకటరత్నం గొప్పఆదర్శనీయుడని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం కర్నూలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మైనేని వెంకటరత్నం వర్ధంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె. సురేష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి తదితరులు పాల్గొన్నారు. మైనేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ యుటిఎఫ్ నిర్మాణంలో మైనేని కూడా ఒకరని పేర్కొన్నారు. ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడిగా ఆయన పని చేస్తూ అభ్యుదయ భావజాలాన్ని ఉపాధ్యాయులకు తీసుకు వెళ్లేందుకు కృషి చేసేవారన్నారు. ఉపాధ్యాయులను తన రచనల ద్వారా చైతన్యం చేశారన్నారు. అలాంటి మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, చంద్రకళ , జిల్లా నాయకులు, చిన్న మద్దిలేటి, సర్వేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, రంగన్న, సురేష్ కుమార్, రమేష్ బాబు, హనుమన్న ,జయరాజ్ పాల్గొన్నారు.


నివాళ్లులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మైనేని వెంకటరత్నం స్ఫూర్తితో ఉద్యమం

ఆలూరు : ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు, యుటిఎఫ్ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన అమరజీవి మైనేని వెంకటరత్నం స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమాలు చేపడుతామని యుటిఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ కాశీం తెలిపారు. ఆలూరు యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోయనగర్‌లోని పాఠశాలలో మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కాశీం, జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, మండల అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ మైనేని వెంకటరత్నం స్ఫూర్తితో యువ నాయకత్వం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై యూనియన్ పిలుపు నిచ్చే ఉద్యమాలలో పాల్గొనాలన్నారు. అనంతరం స్వామి వివేకానంద సరస్వతి జయంతిని ఘనంగా నిర్వహించారు. హాలహర్వి మండల అధ్యక్షుడు సుధాశేకర్, చంద్రశేఖర్ నాయుడు, ఉరుకుంద, శేఖర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోవిందప్ప పాల్గొన్నారు.


ఆలూరు : నివాళ్లులర్పిస్తున్న నాయకులు

డాక్టర్ ఉమాదేవికి తెలుగు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలుకల్చరల్




కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ కామవరం గ్రామానికి చెందిన డాక్టర్ బి.ఉమాదేవికి శ్రీశ్రీ కళావేదిక సంస్థ కీర్తి పురస్కారం ప్రకటించింది. సాహిత్య రంగంలో చేస్తున్న కృషిని గుర్తింపుగా ఈ పురస్కారాన్ని కత్తి మండప్రతాప్ ఆధ్వర్యం లోని శ్రీశ్రీ కళావేదిక వారు జనవరి 21న విజయవాడలో ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. తెలుగు భాషా సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం తెలుగు కళల పరిరక్షణకోసం నిరంతరం చేస్తున్న శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్‌బుక్ రికార్డ్, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు. కవి మిత్రులు కుటుంబ సభ్యులందరూ కవయిత్రికి అభినందనలు తెలిపారు.


బహుమతి ప్రదానం చేస్తున్న టిజి వెంకటేష్ తదితరులు

ముగిసిన నృత్యోత్సవాలు

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

జాతీయ స్థాయి శాస్త్రీయ జానపద నృత్యోత్సవాలకు అనేక రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరు కావటం కర్నూలు నగరానికి గర్వకారణమని మాజీ రాజ్యసభ సభ్యులు వెంకటేష్ అన్నారు. గత మూడు రోజులుగా కర్నూలు నగరంలో జరుగుతున్న జాతీయస్థాయి జానపద శాస్త్రీయ నృత్య పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి ఆయన బహుమతి ప్రదానం చేశారు. టిజి.వెంకటేష్ మాట్లాడుతూ కర్నూల్ నగరం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. హిందూ ముస్లిం క్రైస్తవ సోదరులు కలిసి మెలిసి పండుగల జరుపుకోవాలన్నారు. అంతకు ముందు టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తిఓబులయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా టిజివి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. నటరాజనృత్య కళామందిరం కళాశాల అవార్డుల కోసం పోటీలు నిర్వహించడం అనేక రాష్ట్రాలకు చెందిన కళాకారులు మూడు రోజులపాటు పోటీల్లో పాల్గొని ప్రదర్శించారని చెప్పారు. నిర్వాహకులు కరీముల్లా స్వాగతం పలుకుతూ 200 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. అదే విధంగా చిన్న జీయర్ స్వామి ఆస్థాన నాట్యాచార్యులు ఘంటసాల పవన్ అనంతపురం కూచిపూడి నాట్యాచార్యులు ఇంకా అనేకమంది నాట్యాచార్యులు ఉత్సవాలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్నం శివప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, ఇల్లూరు లక్ష్మయ్య, చంద్రశేఖర్, వ్యాఖ్యాత సునీత పాల్గొన్నారు. నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను టిజి. వెంకటేష్ అందజేశారు. దీంతో జాతీయస్థాయి శాస్త్రీయ జానపద నత్య పోటీలు వైభవంగా ముగిశాయి.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గురుశేఖర్ ,తదితరులు

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సి బెళగల్

రజక సంఘం క్యాలెండర్‌ను రజక సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్ అధ్యక్షతన మండల అధ్యక్షులు బాలచంద్రుడు ఆదివారం కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరణ చేశారు. కాలమాన పట్టిక సమయాన్ని, రోజులను సూచిస్తుందని ఇందుకు సహకారం అందించిన ప్రజలకు, అభిమానులకు, దాతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రజకుల హక్కుల కోసం పాటు పడాలని గురుశేఖర్ కోరారు.

అపహరించబడిన బాలుడు క్షేమం

- గుట్టు రట్టు అవుతుందని తల్లిదండ్రుల ఇంటి వద్దే బాలుడిని వదిలి వెళ్ళిన దుండగులు
- నిందితుల కోసం గాలింపు చర్యలకు ఆదేశం
- బాలుడు ఆచూకీకి కృషి చేసిన పోలీసులను అభినందించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గత నెల 20న కర్నూలు నాలుగవ పట్టణ స్టేషన్ పరిధిలో కిడ్నాప్ కు గురైన బాలుడి కథ ఎట్టకేలకు సుఖాంతమైందని, బాలుడు క్షేమంగా లభించాడని కర్నూలు ఎస్పి జి.బిందుమాధవ్ తెలిపారు. బాలుడి తల్లిదండ్రులను ఆదివారం కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బాలుడిని కర్నూల్ టౌన్ డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ సమక్షంలో నాలుగో పట్టణం పోలీసులతో కలసి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి కిడ్నాప్ కేసు వివరాలను కర్నూలు డిఎస్‌పి వెల్లడించారు. ఢిల్లీ ప్రాంతం నుండి వచ్చి కర్నూలు-కోడుమూర్ శివార్లలో గుడిసెలు వేసుకొని రోడ్డు పై పిల్లల బొమ్మలు అమ్ముకొని జీవించే అజిత్ రాథోడ్, అతని భార్య ఆశా, తన పిల్లలతో కలసి జీవిస్తున్నారు. గత నెల 20న అర్ధ రాత్రి గుడిసెలో నిద్రిస్తుండగా 8 నెలల చిన్న కొడుకు ఆకాష్‌రాథోడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నగరం లోని పోలీసు అధికారులందరూ బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అవకాశం ఉన్న అన్నీ ప్రాంతాలలోని సిసి కెమెరాలను పరిశీలించారు. అనుమానిత మొబైల్ నెంబర్లను సేకరించి విచారిస్తూ, అనుమానిత వ్యక్తులను తనిఖీలు చేశారు. కర్నూలు జిల్లాతో పాటు కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు చర్యల ఫలితంగా గత రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో కిడ్నాప్‌కు గురయిన బాలుడు తల్లి దండ్రులు ఉండే ఇంటికి దగ్గరలో క్షేమంగా కనిపించాడు. తమ గుట్టు బయట పడుతుందనే భయంతో బాలుడిని తల్లి దండ్రుల వద్దనే వదిలి పారిపోయారని భావిస్తున్నారు. జిల్లా ఎస్‌పికి, కర్నూలు పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు , బంధువులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అయినప్పటికి కిడ్నాప్ చేసిన నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కిడ్నాప్ అయినప్పటి నుండి నేటి వరకు నిర్విరామంగా దర్యాప్తు చేసిన కర్నూలు నాలుగో పట్టణ సిఐ మధుసూధన్ గౌడ్‌ను, ఎస్ఐ చంద్రశేఖర్‌ను,ఇతర పోలీసు అధికారులను ఎస్‌పి, డిఎస్‌పి అభినందించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితులను త్వరగా పట్టుకొమ్మని సంబంధిత పోలీసు అధికారులను కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్ ఆదేశించారు.


తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడితో పోలీసులు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

హోసూరు నుండి పెద్దహుల్తికి రోడ్డు వేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-పత్తికొండ

బ్రిటిష్ కాలంలో వేసిన రోడ్డు గుంతలు పడి ప్రయాణికులకు, రైతులకు ఇబ్బందిగా మారిన హోసూర్ నుండి పెద్దహుల్తి వెళ్లే రోడ్డు మార్గాన్ని తక్షణమే వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న తాగు, సాగునీరు, మౌలిక సమస్యలపై లేవనెత్తాలని సూచించారు. హోసూర్ నుండి పెద్దహుల్తి కి రోడ్డు వేసి ఆదోని, మంత్రాలయం వెళ్లే మార్గాలుకు అనుసంధానం చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. సుమారు మూడు కిలోమీటర్లు మేరకు రోడ్లు గుంతలు పడి రైతులు, వాహనదారులు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. లేనిపక్షంలో రైతులను, ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, దస్తగిరి, గంగన్న, రామాంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి క్యాలెండర్ ఆవిష్కరణ

సిపిఎం కార్యాలయంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో 2025 ప్రజానాట్యమండలి నూతన క్యాలెండర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆదివారం ఆవిష్కరించారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, దస్తగిరి, రామాంజనేయులు, ప్రజానాట్యమండలి సభ్యులు కాశి, శీను తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిబి కేంద్ర కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్ మండల కేంద్రంలో కడపలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కేంద్ర కార్యాలయాన్ని కొనసాగించాలని నిరసన తెలిపారు. జి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్, సిఐటియు మండల నాయకులు వి.సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు టి.మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వెనకబడ్డ రాయలసీమలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కేంద్ర కార్యాలయం ఉంటుందని, అది అనేకమంది గ్రామీణ పేదలు రైతులు కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. అలాంటి కేంద్ర కార్యాలయాన్ని కడప జిల్లా నుండి తరలించి విజయవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయం బాధాకరమైన విషయమన్నారు. దేశంలోనే అత్యధిక వెనకబడిన రాయలసీమలో మరిన్ని కేంద్ర కార్యాలయాలు పరిశ్రమలు ఏర్పాటు చేయడం మాని ఇలాంటి చర్యలకు పాల్పడడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. ఇప్పటికైనా తక్షణమే కడపలో ఉన్న కేంద్ర కార్యాలయాన్ని అలాగే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శ్రీరాములు, నాగరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న నాయకులు

చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం గ్రీన్‌కో ప్రాజెక్ట్ : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం పిన్నాపురం దగ్గర నిర్మించిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే తలమానికమని, ఇది చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. ఈ ప్రాజెక్టును 2014లో టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముందు చూపుతో రాష్ట్రానికి తీసుకువచ్చారని తెలిపారు. 2018లో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్.. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకుందన్నారు. చంద్రబాబు విజన్ కు ఈ ప్రాజెక్టు ఒక నిదర్శనం అన్నారు. ఇప్పుడు కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్టు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజన్‌అని చెప్పడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. నిజం చెప్పాలంటే గత వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ఎన్నో ఇబ్బందులు సృష్టించిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పలు అనుమతులు ఇచ్చేందుకు జాప్యం చేసిందన్నారు. గ్రీన్ కో ప్రాజెక్టును సరైన విధంగా ముందుకు తీసుకువెళ్లాలన్న ఆలోచన కూడా లేదన్నారు. ప్రజలందరికీ వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పటి జీవో కాపీని చూస్తే విషయం అందరికీ తెలుస్తుందన్నారు.

అతిరథుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ప్లాటినమ్ జూబ్లీ మహాసమ్మేళన వేడుకలకు పూర్వ విద్యార్థుల మహా కలయికని అని మహా అతిరథులు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, మాచాని గంగాధర్, మాచాని రఘునాథ్, తారకేష్, ఐఎఎస్ నర్సింహా రెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్లాటినమ్ జూబ్లీ ఆత్మీయసమ్మేళనం కార్యక్రమం ప్లాటినమ్ జూబ్లీ కమిటీ సభ్యులు షఫివుల్లా, ఎంసి శివ కుమార్, మాచాని వెంకటేష్, కెఆర్.నటరాజ్ కామేళె గణేష్, ప్రకాష్ జైన్, మల్లికార్జున, యల్లప్ప, శ్రీనివాసులు, రామన్న, కృష్ణ, నీలకంఠ, శంకర్,నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అతిరథ మహారథులు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి. మాచాని గంగాధర్, మాచాని రఘునాథ్, తారకేష్, ఐఎఎస్ నర్సింహారెడ్డి, గురువులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా పావురాన్ని ఎగురవేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువులను, దాతలను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పేదలకు ఎంతో మందికి ఆర్థికంగా సేవలు అందించిన మహానుభావుడు పద్మశ్రీ మాచాని సోమప్ప అని కొనియాడారు. మడ్డీఅంజియ్య,



ఐఎఎస్ అధికారి, పారిశ్రామిక వేత్తలు, తదితరులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

సారా ఉసేనప్ప, కెఆర్ హనుమంతు రెడ్డి, కెఎస్‌పి పార్వతప్ప వారివారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాచాని గంగాధర్ మాట్లాడుతూ ప్లాటినం జూబ్లీ మహా సమ్మేళనం కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి పూర్వ విద్యార్థులను వేదికపై కలపడం సంతోష దాయకంగా వుందన్నారు. పాఠశాలలో గురువులు నేర్పిన చదువుల వల్ల ఆత్యున్నత స్థానంలో నిలిచానన్నారు. ఐఎఎస్ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ గురువులు నేర్పిన చదువులు ఉన్నత పదవులు పొందగలిగామన్నారు. పూర్వ విద్యార్థులను కలవడం ఆనందంగా ఉందన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

మంత్రాలయం మండలం సౌలహల్లి గ్రామానికి చెందిన బోయ ఈరన్న కు మంజూరైన నూతన గోకులంషెడ్డును ఎమ్మెల్యే వై.బాలనాగరెడ్డి ప్రారంభించారు. ఆదివారం గ్రామానికి చేరుకొన్న ఆయనకు వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల నడుమ పూల మాలలు వేసి ఘనస్వాగతం పలికారు. గోకులం షెడ్డుకు చేరుకున్న అనంతరం ఎంపిడి శోభారాణి పూలబొకేను అందజేశారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిడి లోకేశ్వర్, ఎపిఒ తిమ్మారెడ్డి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ. 1.45 లక్షల తో నిర్మించిన గోకులం షెడ్డును రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. వైసిపి మండలాధక్ష్యులు భీంరెడ్డి , ఇచ్చార్జి విశ్వనాథ రెడ్డి , మాజీ ఎంపిపి రాఘవేణమ్మ , బూదూరు మల్లికార్జున రెడ్డి, సుధాకర్‌రెడ్డి,రాఘవేంద్రరెడ్డి,



గోకులం షెడ్డును ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సాయిరామ్‌రెడ్డి, విజయరామిరెడ్డి, నరసింహ రెడ్డి, నర్సిరెడ్డి, ఎంపిటిసి ఈరన్న, బొజ్జప్ప, పెద్ద రంగన్న ఇఒపిఆర్‌డి ప్రభావతి, ఇసి శ్రీనివాసులు , టిఎ నాయుడు , పశువైద్యాధికారి సురేఖ పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్

శివారెడ్డి గౌడ్ కు శుభాకాంక్షలు -వైసిపి బలోపేతానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-నందవరం

నందవరం మండలంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని వైసిపి పార్టీ మండల నూతన అధ్యక్షులు శివారెడ్డి గౌడ్ అన్నారు. నాపై నమ్మకంతో రెండోసారి పార్టీ మండల అధ్యక్షునిగా అవకాశాన్ని కల్పించడం ఆనందదాయకంగా ఉందని తెలిపారు. మండలంలోని కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయనను వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు,శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మిత్రులు దేవేందర్ రెడ్డి, శిల్ప రంగన్న, సుబ్బాజీ, ముగితి సర్పంచ్ విరుపాక్ష రెడ్డి, ముగితి ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, రామాచారి,



ప్రేమ్‌కుమార్, పులచింత మాజీ సర్పంచి సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, దత్తాత్రేయగౌడ్, ఎల్లగౌడ్, మీసాల సంపత్ గౌడ్, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఎంపిటిసి సామెల్ నాగన్న, తెలుగు శీను, చిన్న ఎల్లప్ప, పంపయ్య, కుమార్, ఆటో బంగారి, గాదలింగప్ప, ఆటో ఎంకప్ప, శేషాద్రి, సుగురప్ప, ఫక్రుద్దీన్, గోపాల్, ఆనంద్, మోషన్న పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక సంబంధాలు : సిఐ గంగాధర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

క్రీడా పోటీల ద్వారా వివిధ ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక సత్సంబంధాలు మెరుగుపడతాయని గోనెగండ్ల సిఐ గంగాధర్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన గోనెగండ్ల జడ్‌పి హైస్కూల్ మైదానంలో గోనెగండ్ల ఎంప్లాయిస్, రైజింగ్ స్టార్ టీం సౌజన్యంతో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని



ఓటమి గెలుపుకు తొలిమెట్టని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్ల వల్ల క్రీడాకారుల్లో శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం క్రమశిక్షణతో పాటు వివిధ ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. అనంతరం ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మనోజ్, కళ్యాణ్, ఖాజా,వేణు పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-దేవనకొండ

ంఅప్పుల బాధభరించలేక దేవనకొండ మండలం కుంకునూరు గ్రామానికి చెందిన రైతు వడ్డే రామాంజనేయులు (50)పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు తనకున్న ఐదెకరాల పొలంలో వ్యవసాయం చేసుకొని



జీవనం సాగించేవాడు. ఐదేళ్లుగా వర్షాబావ పరిస్థితులతో పెట్టిన పెట్టుబడి చేతికి రాక దాదాపు రూ.8 లక్షల అప్పులు మిగిలాయి. అప్పులు ఎక్కువ అవడంతో అప్పులిచ్చిన వారికి సమాధానం చెప్పలేక పురుగుల మందును తాగాడు. ప్రథమ చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైతు కోలుకోలేక ఆదివారం చనిపోయారు. రైతుకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో కుటుంబ సభ్యుల విషాదఛాయలు అలుముకున్నాయి.

కంది రైతు కుదేలు

దెబ్బతీసిన అధిక వర్షాలు, తెగుళ్లు

ప్రజాశక్తి-హాలహర్వి

నష్టం అంటున్న రైతులు ఈ ఏడాది అపరాలకు మంచి గిరాకీ ఉంటుందని, అధికధర ఆశతో గతేడాదికి మించి రైతులు మండలంలో కందిని సాగు చేశారు. పైరు ఏపుగా పెరుగుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నవంబరు నెలలో తుఫానుల ప్రభావంతో దడిపట్టి కురిసిన వర్షాలు కంది రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. అధికంగా కురిసిన వర్షాలకు భూమిలో తేమశాతం ఎక్కువై కంది పైరుకు వైరస్ సోకింది. దీంతో పాటు కొన్నిచోట్ల కంది నిట్టనిలువునా ఎండిపోయింది. ఈ ఏడాది నష్టాలు తప్పవని కంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈనేపథ్యంలో హాలహర్వి మండలంలో కందిసాగుపై ప్రత్యేకకథనం.. హాలహర్వి, హర్ధగిరి, మెదేహాల్ చింతకుంట బాపూరం విరుపాపురం తదితర గ్రామాల్లో సుమారు 3.5వేల ఎకరాలకు పైగా కందిపంటను సాగుచేశారు. వర్షాలతో సోకిన వైరస్ తెగులు నివారణకు రైతులు వేలాది రూపాయల అప్పుచేసి పలు రసాయనిక మందులను పిచికారీ చేశారు. అయినప్పటికీ ఫలితం లేదు. డిసెంబర్ నెలలో పూత, పిందెరావాల్సి ఉండగా



ఏపుగా పెరిగిన కంది చేను

రాలేదు. దీంతో కంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు రూ.20,000 వరకు ఖర్చు చేశారు. వీటిలో దుక్కికి రూ.3వేలు, విత్తనాలు వెయ్యి, కౌలుకు రూ.5వేలు, ఎరువులు, రసాయనిక మందులకు రూ.8వేలు, ఇతర ఖర్చులు కలుపుకుని దాదాపుగా ఖర్చు దాదాపు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వచ్చింది. ఎరువుల దుకాణాల వద్ద వేలల్లో అప్పులు చేసి మందులు తెచ్చి కందిపై పిచికారి చేసినా కంది పంట అనుకున్నస్థాయిలో దిగుబడి రాలేదు. కనీసం మార్కెట్లో రేటు ఉంటుందని అనుకున్న రైతులు రూ.ఆరున్నర వేల నుండి ఏడున్నర లోపల ఉందని క్షోభ పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనిగోలు చేయాలని దళారుల దగ్గర మోసపోతున్నామని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు

మద్దతు ధర కల్పించాలి: రైతు సునీల్ రెడ్డి



నాలుగు ఎకరాల్లో కంది వేశాను రూ.లక్ష దాకా ఖర్చయింది. కనీసం పది క్వింటాలు కూడా కాలేదు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర రైతులకు కల్పిస్తే నష్టపోయిన రైతులకు కొద్ది వరకు అయినా సహాయం చేసినట్లవుతుందని ఆశిస్తున్నాం.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి: రైతు విష్ణువర్ధన్ రెడ్డి



ఏడెకరాలలో కంది పంట వేశాను. దాదాపు రూ.లక్షన్నర ఖర్చయింది. పురుగు మందులు అధిక ధరలకు కొని పైరుకు స్ప్రే చేశాను. 14 క్వింటాళ్లు కూడా కాలేదు. ప్రభుత్వం స్పందించి రైతుకు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి రైతును ఆదుకోవాలని కోరుకుంటున్నాను.

ఆలూరు చెరువును కాపాడండి: సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు చెరువును ఆక్రమణదారుల నుండి కాపాడాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు పి.హనుమంతు, ఆలూరు ప్రాంతీయ కమిటీ నాయకులు కృష్ణ, మైన ,ఈరన్న డిమాండ్ చేశారు.ఆదివారం సాయంత్రం సిపిఎం బృందం ఆలూరు చెరువులోని ఆక్రమణకు గురి అయిన ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేనెంబర్ 748లో 155.73 ఎకరాల విస్తీర్ణంలో ఉందని ఈ చెరువు గత పది సంవత్సరాల నుండి చెరువు నిండక పోవడంతో విస్తారమైన ఖాళీ స్థలం ఉండడంవల్ల భూ కబ్జాదారుల కన్ను పడిందని వారన్నారు. గత 15 సంవత్సరాల నుండి చెరువుకు సంబంధించిన స్థలంలో ఇప్పటికే ఇల్లు దేవాలయాలు ఖాళీ స్థలం ఆక్రమించుకుని బండలు నాటారని తెలిపారు. 2022 సంవత్సరంలో మూడెకరాల స్థలంలో చదును చేసుకుని గతంలో అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా ప్రజా సంఘాలు ,కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటాల వల్ల ఆక్రమణలను



కాపాడారని వారన్నారు. మరల గత రెండు మూడు రోజుల కిందట అధికార పార్టీ నాయకులు చెరువు స్థలంలో సరిహద్దు రాళ్లు వేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారన్నారు. గతంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు మొక్కుబడిగా వచ్చి ఆలూరు చెరువును కబ్జాదారుల నుండి కాపాడుతామని సర్వే చేసి చెరువు సరిహద్దు చుట్టూ కంచే వేస్తామని ప్రగల్బాలు పలికారే తప్ప ఇప్పటికి ఆచరణలో ఏమీ చేయలేదన్నారు. అందుకోసం అధికార పార్టీ నాయకులు భూ కబ్జాదారులు రెచ్చిపోయి ఆలూరు చెరువు స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారని వారన్నారు. ఇప్పటికైనా మైనర్ ఇరిగేషన్ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చెరువులు సర్వే చేయించి భూ కబ్జాదారుల నుండి కాపాడాలని, చెరువు స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను, రైతులను సమీకరించి తహశీల్దార్ కార్యాలయాన్ని, మైనర్ ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వైన్ షాపుల డీల్‌లో ప్రమేయమే లేదు

ప్రజాశక్తి-ఆదోని

వైన్ షాపుల నుండి మామూళ్ల వసూళ్లలో తమ ప్రమేయం లేదని అనవసరంగా నోరు జారడం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి తగదని ఆదోని జనసేన ఇన్‌చార్జి మల్లప్ప పేర్కొన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం అమ్మకాల వ్యవహారంలో ప్రభుత్వం మార్జిన్ తొమ్మిదిశాతం మాత్రమే ఇస్తుందని ఆదాయం రావడంలేదని వైన్ షాపుల నిర్వాహకులు తమను సంప్రదించారన్నారు. వారి సమస్యలు విని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చామే తప్ప ఎవరి నుండి పైసా తీసుకోలేదన్నారు. రాజకీయాలు హుందాగా చేయాలని దిగజారుడుగా వివరిస్తే ప్రజల్లో చులకన అవకతప్పదన్నారు. ఆదోని పట్టణంలో మద్యం దుకాణాల నుండి నెలనెలా రూ.32 వేల చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నాడని తనపై మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చేసిన విమర్శ వెనక్కి తీసుకోవాలన్నారు. వైన్‌షాపుల నిర్వహణలో వైసిపి నాయకులు కూడా ఉన్నారని, వారిని అడిగి నిజనిజాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని, లేనియెడల ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారులను భయపెట్టే ధోరణి మాజీ ఎమ్మెల్యే మానుకోవాలని అన్నారు. మున్సిపాలిటీ వైసిపి ఆధీనంలోనే ఉందన్న నిజాన్ని కూడా గ్రహించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. మురుగు కాలువల్లో షిల్టు తొలగించేందుకు ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక నిధులు రూ.ఒక కోటి16 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఇంతవరకు పనులకు సంబంధించిన టెండర్ ప్రారంభం కాలేదని, అప్పుడే నిధులు మింగేశారని ఆరోపించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఇప్పటికైనా చెప్పుడు మాటలు వినకుండా వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆధారాలు లేని ఆరోపణలు చేయడం తగదన్నారు. హైందవ శంఖారావంకు సహకరించాలని కొందరిని అడిగారే తప్ప బలవంతం చేయలేదని తెలుసుకోవాలన్నారు. భూ కబ్జాలు, దౌర్జన్యాలు, అక్రమ ఇసుక, గరుసు అమ్మకాలు వంటివి వారి నుండే వచ్చినవి గ్రహించాలన్నారు.బడుగు బలహీన వర్గాల వారు రాజకీయంగా ఎదుగుతున్నారన్న అక్కసు తోనే లేనిపోని ఆరోపణలు చేసి ప్రజల్లోకి తప్పుడు సమాచారం పంపించే ప్రయత్నాన్ని సాయి ప్రసాద్ రెడ్డి మానుకోవాలన్నారు. ఆదోని మున్సిపల్ కమిషనర్‌ను భయపెట్టే ధోరణిలో మాట్లాడడం తగదని, అధికారిని ఏకవచనంతో సంబోధించడం



మాట్లాడుతున్న జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప

సమంజసం కాదని అన్నారు. ఇప్పటికీ అధికారంలో ఉన్నామన్న అహంకారంతోనే ఆయన వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా తగ్గాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రేణువర్మ ,తహర్‌వలి, పులి రాజు, ప్రకాష్, చంద్రశేఖర్, చిరుత రాజశేఖర్ ,సిద్ధ ,హరి, శ్రీనివాసులు ఉన్నారు.




కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర్‌రెడ్డి

మా ప్రాంత నీటివాటా ఇప్పించాలి

కలెక్టర్‌ను కోరిని ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

మన ప్రాంతానికి రావాల్సిన నీటి వాటాను ఇప్పించాలని జిల్లా కలెక్టరుకు ఎమ్మెల్యే డాక్టర్ బి విజయ నాగేశ్వర్ రెడ్డి ఆదివారం విన్నవించారు. మాట్లాడుతూ హంద్రీ నీవా ప్రధాన కాలువ నుంచి మూడు టిఎంసిల నీటిని 392 క్యూసెక్కుల సామర్థ్యంతో విడుదల చేయాలని జిఒఆర్‌టి నంబర్ 82 ప్రకారం ఉందన్నారు. ఈ ఏడాది కేవలం 0.40 టీఎంసీ మాత్రమే విడుదల చేశారని, అదే సమయంలో 200 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందన్నారు. ప్రస్తుతం గండికోట రిజర్వాయర్‌లో 2.12 టీఎంసీ మాత్రమే నీరు మిగిలి ఉండడంతో తాగు, సాగునీటి అవసరాలు సమస్యగా మారాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు వివరించారు. తక్షణమే 392 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు.



డిప్యూటి కలెక్టర్‌ను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు రవికుమార్ తదితరులు

డిప్యూటీ కలెక్టరు ను సన్మానించిన యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ ఎస్ఎస్ఎ ఎపిసిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నిత్యానందరాజును ఆదివారం యుటిఎఫ్ నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి యెహోషువ, జిల్లా కార్యదర్శి ఎటి తిమ్మన్న, సీనియర్ నాయకులు హనుమంతు, మారెప్ప, సోమన్న, నరసయ్య, హనుమన్న, మల్లయ్య, మనోజ్, గంగారావు, అడ్వకేట్ మాదన్న పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ సంబంధించి అనేక పాఠశాలలను పునరుద్ధరించి క్రమంలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దళిత సామాన్య కుటుంబంలో జన్మించి క్రమంగా పదోన్నతి పై అభివృద్ధి చెందుతూ ఈ దశకు రావడం హర్శించ దగ్గ విషయమన్నారు.

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం

పజాశక్తి-కర్నూలు క్రైమ్

స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం కర్నూలు మండలం, జి పుల్లారెడ్డి కాలేజీ సమీపంలోని విజ్ఞాన పీఠం పాఠశాలలో విజ్ఞాన సేవాసమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద 162 వ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వివేకనంద విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలలో స్వామి వివేకానంద ప్రసంగించుచుండగా ఆయన ప్రసంగానికి ముగ్దులై, స్వామి వివేకానంద లాంటి వారు కూడా భారతదేశంలో ఉన్నారా అని ఆశ్చర్యపోయారన్నారు. ఆయన చిన్న వయసులోనే పాశ్చాత్య దేశాలలో,పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించారన్నారు. విజ్ఞాన సేవా సమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాపరిషత్ : యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని కురువ సంఘం నాయకులు అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా కురువ సంఘము ఆధ్వర్యంలో రాజవిహార్ సర్కిల్ లోని స్వామి వివేకానంద విగ్రహానికి కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయులు, ప్రధాన కార్యదర్శి ఎం. కె. రంగస్వామి, కోశాధికారి కెసి. నాగన్న, సహాయ కార్యదర్శులు బిసి. తిరుపాలు తదితరులు నివాళి అర్పించారు.

నందవరం: నందవరం మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానందుడు ప్రపంచ దేశాలకు భారత జాతి యొక్క సనాతన ధర్మాన్ని,యువకులకు ఆత్మస్థైర్యాన్ని నింపిన బోధనలని గుర్తు చేసుకున్నారు. బిజెపి నందవరం మండల అధ్యక్షులు మఠం రాజశేఖర స్వామి, గురజాల అయ్యప్ప రెడ్డి, చంద్ర గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162 వ జయంతి ఘనంగా నిర్వహించారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద 1863 జనవరి 12వ తేదీన పశ్చిమ బెంగాల్ కోల్‌కతా నగరంలో జన్మించారన్నారు. గురువుగా రామకృష్ణ పరమాంసను గురువుగా చేసుకొని ఆయన ప్రయాణంలో మూఢనమ్మకాలను విగ్రహారాధనలు చేయకూడదని ప్రచారం చేశారన్నారు. దేశవ్యాప్తంగా స్వామి వివేకానంద ఆలోచనలు ఆదర్శం చేసుకొని ప్రతి యువతి యువకులు స్నేహ దృక్పథంతో పనిచేయాలని, మతసామరస్యాన్ని కాపాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు రవి, ఉదయ్, ప్రకాష్, గిరి, మాస్, గణేశ్, చరణ్, జగన్, తర్కేశ్, యశ్వంత్, దీపక్, మోహిన్, భార్గవ్, కేశవ, పాల్గొన్నారు.

ఆదోని: వివేకానందుడి ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. వారు మాట్లాడారు యువతను ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని వివేకనందుడు పలు సందర్భాలలో



ఆదోనిలో నివాళ్లు అర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పేర్కొన్నారన్నారు. విద్య ఉపాధి కోసం నిరంతర పోరాటాలకు నేటి యువతసిద్ధం కావాలన్నారు. యువత మేలుకొలుపు కోసం వివేకానందుడు అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే యువత ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధిస్తామన్నారు. డివైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు సతీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, శశి తదితరులు ఉన్నారు.

హారిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో ఘనంగా వివేకానంద జయంతి

కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు సోమిశెట్టి నగర్ హొజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూలులో చైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ పావనిల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్మన్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను చిన్నారులకు చిన్న కథలుగా వివరించి బోధిస్తున్నామని అన్నారు. డైరెక్టర్ పావని మాట్లాడుతూ చిన్నారుల వేషధారణలో స్వామి వివేకానందను తమ హదయాలలో పదిలపరుచుకునేటట్లు ఆకర్షణీయంగా తయారు చేశామన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డి పోటీలు

ప్రజాశక్తి-ఆస్పరి

సంక్రాంతి పండగ పురస్కరించుకొని మండల కేంద్రమైన ఆస్పరిలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆస్పరిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ అరవింద్, రామకృష్ణ, మహేష్‌లు ఆదివారం తెలిపారు. ఈ కబడ్డీ పోటీలలో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి సర్పంచి ములింటి రాధమ్మ, కెడిసిసి బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర లు రూ.20,116 , రెండవ బహుమతి ఆస్పరి సేవా సమితి సభ్యులు రూ.10,116, మూడో బహుమతి మేకల రంగనాథ్ రూ.5,116 అందజేస్తారన్నారు. సోమవారం ఉదయం 10 గంటలలోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 9010788451, 9912951780, 9912596807 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా ప్రహ్లాదాచారి

ప్రజాశక్తి- కౌతాళం

వైసిపి మండల కన్వీనర్ గా దేశాయి ప్రహ్లద ప్రహల్లాదాచారిని పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆదివారం దేశాయి ప్రహల్లాద చారి మాట్లాడుతూ మండలంలోని వైసిపి కార్యకర్తల కోసం అందుబాటులో ఉండి అండగా ఉంటామన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడుతామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి రావడానికి కృషిచేసిన రాంపురం రెడ్డి సోదరులు ఎమ్మెల్యే వై బాలానగర్ రెడ్డి, వై సీతారాం రెడ్డి, వారి కుమారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.